PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 356 పేజీలు - 08 గురువారం 19 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నిన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం

- రాజకీయ ప్రాతినిధ్యం నుంచి విద్య, వైద్యం, ఉపాధి వరకు ప్రత్యేక ప్రాధాన్యత.. అణగారిన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 18: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఆయా వర్గాలకు సముచిత అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో పార్లమెంటరీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే, ఇతర సభ్యులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను

మిగతా2లో...



2లో

ప్రధాని మోదీతో ప్రిన్స్ విలియం, కేట్ భేటీ

- మూడు రోజుల భారత పర్యటన ముగింపు.. భారత్‌బ్రిటన్ సంబంధాలు, వాణిజ్యం, పర్యావరణ అంశాలపై చర్చ



ఆసియా-పసిఫిక్ దేశాల ఐక్యతకు జిన్‌పింగ్ పిలుపు

- పరస్పర సహకారం, శాంతి, స్వేచ్ఛా వాణిజ్యంతో ఉమ్మడి అభివృద్ధి సాధిద్దామని సూచన

తొలి అక్షరం/షెన్‌జెన్,నవంబర్ 18: ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని దేశాలన్నీ విభేదాలను పక్కనపెట్టి, పరస్పర సహకారంతో ఒకే కుటుంబంలా ముందుకు సాగాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ప్రాంతీయ శాంతి, ఆర్థిక స్థిరత్వం, ఉమ్మడి అభివృద్ధి కోసం దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కావాలని ఆయన

మిగతా2లో...

నాగార్జునసాగర్‌లో జలదోపిడీకి కుట్ర!

- తాగునీటి పేరుతో 9 టీఎంసీల నీటి తరలింపునకు ప్రయత్నం.. తెలంగాణ హక్కులను కాపాడాలి: కేటీఆర్



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 18: నాగార్జునసాగర్‌లో భారీ సొరంగం నిర్మించి తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తాగునీటి పథకం పేరుతో డెడ్‌స్టోరేజీ నుంచి తొమ్మిది టీఎంసీల నీటిని తరలించేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా పనులు చేపడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ విజయపురి సౌత్ వద్ద ఏడాదిగా సొరంగం నిర్మాణ పనులు జరుగుతున్నాయని,

మిగతా2లో...

భారత్ ఆర్థిక విపత్తు దిశగా పయనం!

- దేశంలో నిరుద్యోగం తీవ్రం.. విద్యావ్యవస్థలోనూ లోపాలు.. తయారీ రంగాన్ని బలోపేతం చేయాలి: రాహుల్ గాంధీ



తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 18: దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోందని, భారత్ ఆర్థిక విపత్తు అంచున ఉందని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. అమెరికాలోని న్యూయార్క్ కొలంబియా యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులతో జరిగిన సమావేశంలో ఆయన దేశ ఆర్థిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, విద్యా వ్యవస్థలోనూ అనేక లోపాలున్నాయని పేర్కొన్నారు. దేశ యువతకు భవిష్యత్తుపై భరోసా కలగడం లేదన్నారు. దాదాపు దశాబ్ద కాలంగా దేశ ఆర్థిక నమూనా ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదని విమర్శించారు. చిన్న, మధ్య తరహా

మిగతా2లో...



నేడు సిద్దిపేటకు సీఎం రేవంత్ రెడ్డి

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం.. రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

తొలి అక్షరం/సిద్దిపేట,నవంబర్ 18: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సిద్దిపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. మొత్తం

మిగతా2లో...



ఇందిరమ్మ బీమాకు ప్రత్యేక కేంద్రాలు

- గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ.. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని పథకంలో నమోదు చేయాలని, ఎవరూ మిగిలిపోకుండా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. బుధవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో పథకం అమలు ఏర్పాట్లపై సమీక్షించారు.

మిగతా2లో...

పేద విద్యార్థులకు కిషన్‌రెడ్డి భరోసా

- 4,741 మంది పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపు బాధ్యత స్వీకరణ.. 87 ప్రభుత్వ పాఠశాలలకు లబ్ధి



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 18 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్‌రెడ్డి మరోసారి తన వంతు సహకారం అందించేందుకు ముందుకొచ్చారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 87 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 4,741 మంది విద్యార్థుల పరీక్ష ఫీజులను ఆయనే చెల్లించనున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులపై పరీక్ష ఫీజుల భారం పడకుండా

మిగతా2లో...

ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. **రాజకీయ రంగంలోనూ ప్రాధాన్యత** ఎస్సీ, ఎస్టీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. శాసనసభ స్పీకర్, మంత్రులుగా దళితులకు అవకాశం కల్పించామని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలోనూ ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని కీలక పదవుల్లో అర్హత, అవకాశాలను బట్టి ఆయా వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని వివరించారు. **ఉన్నత విద్యలో కీలక అవకాశాలు** ఉన్నత విద్యా రంగంలోనూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐఐటీలకు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారిని ఉపకులపతులుగా నియమించి అవకాశం కల్పించామని తెలిపారు. విద్యాసంస్థల్లో సమాన అవకాశాలు కల్పించడం ద్వారా ఆయా వర్గాల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యతఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం వివరించారు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్), ఆరోగ్యశ్రీ పథకాల కింద విడుదల చేస్తున్న నిధుల్లో 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ వర్గాల లబ్ధిదారుల కోసం ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేద కుటుంబాలకు వైద్య సహాయం అందించడంతో పాటు గృహ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. **ఎస్సీ వర్గీకరణ అమలు** దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. రిజర్వేషన్ల ప్రయోజనాలు అత్యంత వెనుకబడిన వర్గాలకు అందేలా ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు ద్వారా నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

ప్రభుత్వ చర్యలను అభినందించిన కమిటీ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం చేపడుతున్న చర్యలను పార్లమెంటరీ కమిటీ సభ్యులు అభినందించారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ అమలు, యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటు వంటి కార్యక్రమాలపై ప్రశంసలు వ్యక్తం చేశారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేశ్, పార్లమెంటరీ కమిటీ సభ్యులు తపిర్ గావ్, హరిశ్చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్‌కుమార్, డి. ప్రసాదరావు తదితరులు, రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కృష్ణా బేసిన్‌కు మీరేం చేశారు?

తెలంగాణ నీటి వాటాపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్.. సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి అవసరాలపై ప్రశ్నలు



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 18: కృష్ణా నదీ జలాల వినియోగం, పంపిణీలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కృష్ణా బేసిన్‌లోని జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటో వెల్లడించాలని డిమాండ్ చేశారు.నాగార్జునసాగర్ వద్ద ఆంధ్రప్రదేశ్ చేపడుతున్నట్లు ఆరోపిస్తున్న నీటి తరలింపు పనులను అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. తాగునీటి పథకం పేరుతో సుమారు 9 టీఎంసీల నీటిని తరలించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జలశక్తి శాఖకు ప్రభుత్వం ఏం ఫిర్యాదు చేసిందని ప్రశ్నించారు.కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటా కోసం ప్రభుత్వం గట్టిగా పోరాడాలని అన్నారు. హైదరాబాద్‌తో పాటు పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన 40 టీఎంసీల కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనుల పురోగతిపైనా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మరోవైపు, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఏపీ ప్రతిపాదించిన 1.8 టీఎంసీల తాగునీటి పథకంపై కృష్ణా బోర్డు, కేంద్ర జలశక్తి శాఖకు అభ్యంతరాలు తెలిపిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణకు 555 టీఎంసీల నీటి వాటా కోరుతూ ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర నీటి హక్కుల విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు.

భారత్ ఆర్థిక విపత్తు దిశగా పయనం!

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమలు, వ్యవసాయమే భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన బలమని రాహుల్ అన్నారు. ఈ రంగాలే పెద్దఎత్తున ఉపాధి కల్పిస్తాయని, తయారీ రంగాన్ని తిరిగి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా పథకాలు ఆశించిన స్థాయిలో తయారీ రంగాన్ని అభివృద్ధి చేయలేకపోయాయని విమర్శించారు. సేవారంగం ద్వారా మాత్రమే దేశంలోని యువతకు తగినంత ఉపాధి కల్పించడం సాధ్యం కాదన్నారు.దేశంలో ప్రైవేటు పెట్టుబడులు ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించిన రాహుల్.. కొద్ది పెద్ద వ్యాపార సంస్థలకే అభివృద్ధి అవకాశాలు పరిమితమవుతున్నాయని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలంటే చిన్న పరిశ్రమలు, వ్యవసాయం, తయారీ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.**రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు** రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. విదేశీ వేదికలపై దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యంపై ప్రతికూల వ్యాఖ్యలు చేస్తూ భారత్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని పేర్కొన్నారు. దేశ ప్రగతిని రాహుల్ గాంధీ జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు.దీంతో అమెరికాలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీ మధ్య మరోసారి రాజకీయ విమర్శలకు దారితీశాయి.

పేద విద్యార్థులకు కిషన్‌రెడ్డి భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక కారణాలతో ఏ ఒక్క విద్యార్థి కూడా పరీక్షలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులకు చదువుపై మరింత ఆసక్తి పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు ప్రోత్సాహం అందించడమే ఈ సహకారం వెనుక ఉద్దేశమని తెలిపారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే ఈ కార్యక్రమాన్ని కిషన్‌రెడ్డి గత కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నారు.

ఈ ఏడాది కూడా వేలాది మంది విద్యార్థుల పరీక్ష ఫీజుల బాధ్యతను స్వీకరించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత అందిస్తున్నారు. పదో తరగతి పరీక్షలను భయం లేకుండా, ఆత్మవిశ్వాసంతో రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

బరాక్ క్షిపణుల ఆధునికీకరణకు రూ.1,976 కోట్ల ఒప్పందం

- భారత నౌకాదళ రక్షణ వ్యవస్థ మరింత పటిష్టం.. ఇజ్రాయెల్ సంస్థతో రక్షణ శాఖ ఒప్పందం



తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 18: భారత నౌకాదళ యుద్ధనౌకల్లో మోహరించిన బరాక్ పాయింట్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థల ఆధునికీకరణకు రక్షణ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకోసం ఇజ్రాయెల్‌కు చెందిన ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) సంస్థతో రూ.1,976.40 కోట్ల ఒప్పందంపై బుధవారం సంతకాలు చేసింది. న్యూఢిల్లీలో రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా బరాక్ క్షిపణి వ్యవస్థల హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను ఆధునికీకరించడంతో పాటు పాతబడిన పరికరాలకు నిర్వహణ చేపట్టనున్నారు. దీనివల్ల క్షిపణి వ్యవస్థల పనితీరు, రక్షణ సామర్థ్యం మరింత మెరుగుపడనున్నాయి.బరాక్ వ్యవస్థలు భారత నౌకాదళ యుద్ధనౌకలను వైమానిక దాడులు, ఇతర గగనతల ముప్పుల నుంచి రక్షించేందుకు ఉపయోగపడతాయి. తాజా ఆధునికీకరణతో నౌకాదళానికి మరింత శక్తిమంతమైన, సుదూర వైమానిక రక్షణ సామర్థ్యం అందుబాటులోకి రానుంది.

ప్రధాని మోదీతో ప్రిన్స్ విలియం, కేట్ భేటీ

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 18: బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియం, యువరాణి కేట్ మిడిల్టన్ బుధవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. మూడు రోజుల భారత పర్యటన ముగింపు సందర్భంగా జరిగిన ఈ భేటీలో భారత్‌బ్రిటన్ ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ సహకారంపై చర్చించారు.ముంబైలో జరిగిన ఎర్త్‌షాట్ ప్రైజ్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాజ దంపతులు ఢిల్లీకి చేరుకున్నారు. పర్యావరణ సమస్యలకు వినూత్న పరిష్కారాలను ప్రోత్సహిస్తున్న ఎర్త్‌షాట్ ప్రైజ్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ అభినందించారు. పర్యావరణ పరిరక్షణలో భారతీయ ఆవిష్కరణలు, ప్రతిభను ప్రపంచానికి చాటుతున్న ఈ కార్యక్రమం ప్రాధాన్యతను కొనియాడారు.భారత్, బ్రిటన్ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని మోదీ ఆకాంక్షించారు. ఇటీవల అమల్లోకి వచ్చిన ఇరు దేశాల సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపునిచ్చి, ఇరు దేశాల ప్రజలకు ప్రయోజనాలు కల్పించాలని పేర్కొన్నారు.భారత పర్యటనలో భాగంగా ప్రిన్స్ విలియం ముంబైలోని ప్రముఖ సినీ నిర్మాణ సంస్థను సందర్శించగా, కేట్ మిడిల్టన్ ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడారు. క్రికెట్, సాంస్కృతిక కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాల్లోనూ రాజ దంపతులు పాల్గొన్నారు.

ఆసియా-పసిఫిక్ దేశాల ఐక్యతకు జిన్‌పింగ్ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

ఆకాంక్షించారు.ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార వేదిక (ఏపీఈసీ) సమావేశం నేపథ్యంలో నిర్వహించిన సీఈఓల సదస్సులో జిన్‌పింగ్ ప్రసంగించారు. స్వేచ్ఛా వాణిజ్యం, పరస్పర విశ్వాసం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ప్రాంతీయ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, దేశాలు కలిసి పనిచేస్తే అభివృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించుకోవచ్చని తెలిపారు.చైనా 20262030 పంచవర్ష ప్రణాళిక ప్రపంచ దేశాలకు, ముఖ్యంగా పెట్టుబడిదారులకు కొత్త అవకాశాలను అందిస్తుందని వివరించారు. ఆర్థిక, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించుకోవాలని సూచించారు.రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో ఏపీఈసీ సభ్య దేశాల ప్రతినిధులతో పాటు పలువురు ప్రపంచ నాయకులు, వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చిలీ అధ్యక్షుడు జోస్ ఆంటోనియో కాస్ట్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంలు హాజరయ్యారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతం లో పరస్పర సహకారం, వాణిజ్య సంబంధాల బలోపేతంపై ఈ సమావేశంలో చర్చలు జరగనున్నాయి.

నేడు సిద్ధిపేటకు సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

రూ.544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.451 కోట్ల పనులకు శంకుస్థాపనలు, రూ.93 కోట్ల పనులను ప్రారంభించనున్నారు.

అలాగే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.సీఎం పర్యటన నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి దామోదర రాజనర్సింహ సభా ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో తాగునీరు, పార్కింగ్, బారికేడ్లు, భద్రత, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌ల ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇందిరమ్మ బీమాకు ప్రత్యేక కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి గ్రామ పంచాయతీతో పాటు మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రత్యేక యాప్, ఆన్‌లైన్ నమోదు సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం వివిధ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నారు. ఇప్పటికే నేతన్నలు, గీత కార్మికులు, ఇతర కార్మిక వర్గాలకు అందిస్తున్న జీవిత బీమా మొత్తాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో పాటు ప్రస్తుత ప్రమాద బీమా ప్రయోజనాలను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.నమోదు ప్రక్రియలో స్వయం సహాయక సంఘాల సేవలను వినియోగించుకోవాలని, అర్హులైన కుటుంబ సభ్యుల వివరాలు, బీమా పొందే వ్యక్తి, నామినీల వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెల 19 నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభం కానుండగా, అర్హులైన కుటుంబాలందరికీ పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు.

నాగార్జునసాగర్‌లో జలదోపిడీకి కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

510 అడుగుల డెడ్‌స్టోరేజీ స్థాయి నుంచి కూడా నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారని ఆరోపించారు. సుమారు 1,650 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మించి నీటిని తరలించే ప్రయత్నం జరుగుతోందని, తాగునీటి పథకం ముసుగులో సాగునీటిని కూడా తరలించే ప్రమాదం ఉందన్నారు.తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా గతంలో వ్యవహరించిన ఆదిత్యనాథ్ దాస్‌ను రాష్ట్ర సాగునీటి సలహాదారుగా ఎలా నియమించారని కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఆయన కేంద్రానికి లేఖలు రాశారని ఆరోపించారు. ఈ నియామకంపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కృష్ణా జలాల్లో తెలంగాణకు మిగిలిన 40 టీఎంసీలను తాగునీటి అవసరాలకు కేటాయించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు లేఖ రాశారా లేదా స్పష్టం చేయాలన్నారు. హైదరాబాద్‌తో పాటు పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాలపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు.కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు మొదటి నుంచీ అన్యాయం జరిగిందని కేటీఆర్ విమర్శించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు 8.8 లక్షల ఎకరాలకు నీరు అందిస్తామని చెప్పినా ప్రస్తుతం ఆరు లక్షల ఎకరాలకు మించి అందడం లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను నిలిపివేయడంపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.నాగార్జునసాగర్‌లో నీటి తరలింపు ప్రయత్నాలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ న్యాయపోరాటంతో పాటు ప్రజా ఉద్యమం చేపడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించడంతో పాటు మహబూబ్‌నగర్ జిల్లాలోనూ నీటి హక్కుల కోసం ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు.ఈ సమావేశంలో మాజీ మంత్రులు జి. జగదీశ్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, రవీంద్ర నాయక్, గ్యాదరి కిశోర్, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన ఆర్టీసీ ఎండీ

తొలి అక్షరం/ హైదరాబాద్,నవంబర్ 18: టీజీఎస్ ఆర్టీసీ నూతన వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనిల్‌కుమార్ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ భేటీలో ఆర్టీసీ ప్రస్తుత పరిస్థితి, సంస్థ అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పన, సంస్థను మరింత బలోపేతం చేసే చర్యలపై చర్చించారు. ఆర్టీసీ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నారు.

వధూవరులకు సర్పంచ్ విక్రమ్ ఆశీస్సులు

- వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు



తొలి అక్షరం/రామన్నపేట: నవంబర్ 18: శంషాబాద్‌లో ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త, జీఎస్వీ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత గర్దాసు శ్రీనివాస్, పుష్పలత దంపతుల కుమారుడి వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ కార్యదర్శి, ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామస్థులు, బంధుమిత్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి

- అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి: తహసీల్దార్ వినోద్ కుమార్



తొలి అక్షరం/పెద్దవంగర: అక్టోబర్ 18:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ బలభద్ర వినోద్ కుమార్ కోరారు. నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 19 వరకు మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. రేషన్ కార్డు ఉన్నవారితో పాటు లేనివారు కూడా అర్హులని, 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే మాధవరెడ్డికి సర్పంచ్ కృతజ్ఞతలు

- చంద్రుగొండకు సొసైటీ మంజూరుకు కృషి చేసినందుకు అభినందన



తొలి అక్షరం/నెక్కొండ: నవంబర్ 18: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన 240 సొసైటీల్లో నెక్కొండ మండలం చంద్రుగొండ గ్రామానికి సొసైటీ వచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్యే మాధవరెడ్డిని గ్రామ సర్పంచ్ బక్కి కవిత-అశోక్ కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు బక్కి నరేష్, అనుముల శ్రీధర్ రెడ్డి, కొండల్ రెడ్డి, ఎర్ర సుజాత-రాజు, దాసరి స్వామి, గోక అనిల్, జనగాం వెంకటేశ్వర్లు, వంగ రాజు, కాంగ్రెస్ నా యకులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లండన్‌లో ఎంఎస్ పట్టా.. గ్రామానికి గర్వకారణం

● డేటా సైన్స్‌లో ఉన్నత విద్య సాధించిన నీర్నంల యువకుడు బొల్లం వంశీకృష్ణ





తొలి అక్షరం/రామన్నపేట: నవంబర్ 18: రామన్నపేట మండలం నీర్నంల గ్రామానికి చెందిన బొల్లం వంశీకృష్ణ లండన్‌లోని బీపీపీ యూనివర్సిటీ నుంచి డేటా సైన్స్‌లో ఎంఎస్ పట్టా పొందారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి విదేశాల్లో ఉన్నత విద్య సాధించడంతో గ్రామానికి గుర్తింపు తీసుకొచ్చారు. వంశీకృష్ణ తండ్రి బొల్లం సతీష్ కుమార్. తాత బొల్లం నరసింహ, ముత్తాత బొల్లం మల్లయ్య వ్యవసాయంపై ఆధారపడి జీవించారు. మూడు తరాల కష్టం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వంశీకృష్ణ ఈ విజయాన్ని సాధించారు. మారుమూల గ్రామం నుంచి లండన్ వరకు ఎదిగిన వంశీకృష్ణ ప్రయాణం గ్రామ యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పేద కుటుంబానికి దైద రవీందర్ ఆర్థిక సాయం

- మృతుని కుటుంబానికి పరామర్శ.. దహన సంస్కారాలకు సహకారం





తొలి అక్షరం/రామన్నపేట: నవంబర్ 18: నకిరేకల్ నియోజకవర్గంలోని చీమలగడ్డ ఎస్సీ కాలనీకి చెందిన నిరుపేద వంటెపాక వెంకన్న (భాష) మృతి చెందడంతో తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చారు. దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేద, మధ్యతరగతి కుటుంబాల శుభకార్యాల్లో అండగా నిలుస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

- కాంగ్రెస్ కార్యకర్త కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులకు ఆశీర్వాదం.. రూ.50 వేల ఆర్థిక కానుక అందజేత





తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 18: రాజకీయాల్లోనే కాకుండా ఆపదలో ఉన్నవారికి, ఆప్తుల శుభకార్యాల్లోనూ తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ సామాజిక బాధ్యతను చాటుకుంటున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. చౌటుప్పల్ పట్టణంలోని శుభం గార్డెన్స్‌లో నారాయణపురం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చెక్క నర్సింహా ముదిరాజ్ జంగమ్మ దంపతుల కుమార్తె అశ్విని, శివకుమార్‌ల వివాహ వేడుకకు వారి ఆహ్వానం మేరకు చలమల్ల కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చలమల్ల నర్సింహారెడ్డితో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి నూతన జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా వివాహ కానుకగా రూ.50,000 నగదు అందజేసి కుటుంబానికి తనవంతు ఆర్థిక సహాయం అందించారు. కార్యకర్తల కుటుంబాలను సొంత కుటుంబాలుగా భావిస్తూ వారి సుఖదుఃఖాల్లో పాలుపంచుకోవడం, అవసరమైన సమయంలో అండగా నిలవడం చలమల్ల కృష్ణారెడ్డి సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాల యోధుడు భూపాల్ రెడ్డి

● పేదల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడారు: జాన్ వెస్లీ







తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 18: ప్రజా సమస్యల పరిష్కారం, పేదల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన నిక్కచ్చైన కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ చింతల భూపాల్ రెడ్డి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ కొనియాడారు. చౌటుప్పల్‌లో బుధవారం భూపాల్ రెడ్డి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించి, ఆయన స్తూపాన్ని జాన్ వెస్లీ ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు, ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి కృష్ణా జలాల సాధనతో పాటు సాగునీటి కాలువల నిర్మాణం కోసం భూపాల్ రెడ్డి విశేషంగా పోరాడారని జాన్ వెస్లీ గుర్తుచేశారు. మూసీ పిలాయిపల్లి కాలువ సాధన కోసం ప్రజలను సమీకరించి ఉద్యమించారని తెలిపారు. చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ పార్టీ నిర్మాణం, విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, రైతు సంఘాల బలోపేతానికి భూపాల్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూనే ప్రజా ఉద్యమాల్లో పాల్గొని, అనంతరం పూర్తికాలం పార్టీ కార్యకర్తగా సేవలందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

- రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్యం: ఢిల్లీ మాధవరెడ్డి



తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 18: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు చేపట్టకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఢిల్లీ మాధవరెడ్డి విమర్శించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఎప్పుడు కొనుగోలు చేస్తారని, డబ్బులు ఎప్పుడు ఖాతాల్లో జమ చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే రైతుబంధు అందకపోవడం, యూరియా కొరత, విద్యుత్, సాగునీటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తదుపరి పంట పెట్టుబడులకు రైతులకు డబ్బులు అవసరమని, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించకపోతే రైతుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

కార్మికుల సెస్ నిధులు మళ్లిస్తే ఊరుకోం

- కార్మికుల సంక్షేమానికే నిధులు వినియోగించాలి: గొరిగే సోములు



తొలి అక్షరం/రామన్నపేట: నవంబర్ 18: భవన నిర్మాణ కార్మికుల నుంచి వసూలు చేస్తున్న సెస్ నిధులను ఇతర సంక్షేమ పథకాలకు మళ్లిస్తే సహించేది లేదని భవన నిర్మాణ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగే సోములు హెచ్చరించారు. రామన్నపేటలో జరిగిన కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం సేకరించిన నిధులను వారి భద్రత, భవిష్యత్తు అవసరాలకే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కుటుంబ బీమా పథకానికి సెస్ నిధులను మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కార్మిక సంక్షేమ బోర్డును బలోపేతం చేసి ప్రమాద బీమా, విద్య, వైద్య తదితర ప్రయోజనాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. నిధుల మళ్లింపును విరమించుకోకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, అప్పం సురేందర్, మండల నాయకులు వంగాల మారయ్య, బుడ్డ ప్రసాద్, తరిగొప్పుల వెంకట్ రెడ్డి, గొరిగే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆపన్న హస్తంగా సుమన్ గౌడ్

తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 18: సాహెబ్ నగర్ లో ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆపన్న హస్తంగా, పెద్ద దిక్కుగా ముద్దగౌని సుమన్ గౌడ్ నిలుస్తున్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే తాను ఉన్నానని పెద్ద కొడుకులా ముందు ఉంటున్నారు. ఇంటి పెద్దలేని వాళ్లకు, ఆయా ఫ్యామిలీలకు 3 నెలలకు సరిపడా సరుకులు అందజేస్తున్నారు. అలాగే చిన్నారులకు బుక్స్ పంపిణీ చేస్తూ స్కూల్ ఫీజులను చెల్లిస్తున్నారు. ఇలాంటి సామాజిక సేవలు తన మిత్రులతో కలిసి గత కొంత కాలంగా చేస్తున్నారు. ఇంత గొప్ప మనసుతో సేవలందిస్తున్న ఆయనను స్థానికులు అభినందిస్తున్నారు.



ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి

- బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి: డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి



తొలి అక్షరం/నెక్కొండ: నవంబర్ 18: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు నిరంతరం పోరాడాలని వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు.నెక్కొండ మండల బీజేపీ కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు నాయిని అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి వెన్నెముకని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.మండల అధ్యక్షుడు నాయిని అశోక్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో విజయానికి సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాల్ఫిన్ బేకరీ ప్రారంభించిన సర్పంచ్ హరిప్రసాద్

- నెక్కొండ సర్వాయి పాపన్న సెంటర్‌లో నూతన బేకరీ ప్రారంభం







తొలి అక్షరం/నెక్కొండ: నవంబర్ 18: వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణంలోని సర్దార్ సర్వాయి పాపన్న సెంటర్‌లో మడిపల్లి గ్రామానికి చెందిన లాలు నూతనంగా ఏర్పాటు చేసిన డాల్ఫిన్ బేకరీని నెక్కొండ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, గరికపాటి కృష్ణారావు, మైనార్టీ నాయకులు ఎస్కే షబ్బీర్, ఎండీ అన్వర్, మార్కెట్ డైరెక్టర్ బొమ్మెర బోయిన రమేష్ యాదవ్, వార్డు సభ్యుడు దేవన బోయిన విజేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ మంజూరుపై సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

- చంద్రుగొండ గ్రామానికి సొసైటీ కేటాయింపుపై కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్



తొలి అక్షరం/నెక్కొండ: నవంబర్ 18: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన 240 సొసైటీల్లో నెక్కొండ మండలం చంద్రుగొండ గ్రామానికి సొసైటీ కేటాయించడంపై గ్రామ సర్పంచ్ బక్కి కవిత-అశోక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు బక్కి నరేష్, అనుముల శ్రీధర్ రెడ్డి, కొండల్ రెడ్డి, ఎర్ర సుజాత-రాజు, దాసరి స్వామి, గోక అనిల్, జనగాం వెంకటేశ్వర్లు, వంగ రాజు, కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాజీ ఎంపీటీసీ మాసయ్య గౌడ్‌కు అంజయ్య యాదవ్ ఘన నివాళి




తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 18: కొందుర్గ్ మండలం వెంకీర్యాల గ్రామంలో మాజీ ఎంపీటీసీ మాసయ్య గౌడ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాసయ్య గౌడ్ సేవలను, గ్రామ ప్రజలకు చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, మాజీ సర్పంచులు రాజరామేశ్వర్ రెడ్డి, గోవిందు, భీమయ్య, రాములు, నాయకులు రెడ్డి నర్సింలు, దర్గా రామచంద్రయ్య, లింగం గౌడ్, అబ్దుల్ కలాం, కుమార్ నాయక్, బుద్దోళ్ల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడిసెల్లో నివసించే పేదలకు ఇందిరమ్మ ఇళ్ల వరం

- 46 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్లు పంపిణీ చేసిన చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్





తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 18: పట్టణంలోని నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా 46 మంది లబ్ధిదారులకు నిర్మాణ ప్రొసీడింగ్ ఆర్డర్లను మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పంపిణీ చేశారు. వీరిలో గుడిసెల్లో నివసిస్తున్న నలుగురు నిరుపేద కుటుంబాలకు కూడా ఇళ్ల మంజూరు పత్రాలు అందజేయడం విశేషం.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. చౌటుప్పల్ పట్టణంలోని అన్ని వార్డుల్లో నివసించే నిరుపేద కుటుంబాలకు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల నెరవేరుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి కౌన్సిలర్, కోఆప్షన్ సభ్యుల సహకారంతో పేద ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు పూదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, పాక చిరంజీవి, బద్రి గాలయ్య, చింతల ఉమామహేశ్వరి సాయిలు, పిల్లలమర్రి మధుసూదన్, హన్ను మహమ్మద్, నాయకులు సురేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు, దేప రాజు, బత్తుల విప్లవ కుమార్, ఉడుగు రమేష్, గడ్డం రాజరత్నం, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ దీప, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, హౌసింగ్ ఏఈ కళ్యాణి, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో 3,630 మందికి చేయూత పింఛన్లు

- కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి





తొలి అక్షరం/చౌటుప్పల్ నవంబర్ 19: మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ ఆలపించిన అనంతరం ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మునుగోడు నియోజకవర్గంలోని నల్గొండ జిల్లా పరిధిలో ఉన్న మునుగోడు, గట్టుప్పల్, మర్రిగూడ, నాంపల్లి, చండూరు మండలాలతో పాటు చండూరు మున్సిపాలిటీలో నూతనంగా చేయూత పింఛన్లకు ఎంపికైన మొత్తం 3,630 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.**మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలు ఇలా ఉన్నాయి:**- మునుగోడు మండలంలోని 28 గ్రామాలకు చెందిన 845 మంది.- చండూరు మండలంలోని 19 గ్రామాలకు చెందిన 530 మంది.- చండూరు మున్సిపాలిటీలోని 10 వార్డులకు చెందిన 293 మంది.- మర్రిగూడ మండలంలోని 18 గ్రామాలకు చెందిన 785 మంది.- నాంపల్లి మండలంలోని 32 గ్రామాలకు చెందిన 651 మంది.కొత్తగా పింఛన్లు మంజూరైన వారిలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు ఉన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా చేయూత పింఛన్లు పొందుతున్న వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు అభినందనలు తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం సంతోషకరమని పేర్కొన్నారు.

వనప్రేమికుడు సమ్మయ్యకు అభినందనలు

- చింత మొక్కను నాటిన డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి





తొలి అక్షరం/నెక్కొండ: నవంబర్ 18: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి సెంటర్‌లో అంతర్జాతీయ అవార్డు గ్రహీత, వనప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా చింత మొక్కను నాటారు.ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం మొక్కలు నాటుతూ, వాటిని సంరక్షిస్తున్న సమ్మయ్య సేవలు అభినందనీయమన్నారు. భవిష్యత్ తరాలకు, మానవాళికి, పక్షులకు ఉపయోగపడేలా చెట్ల పెంపకానికి చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాయిని అశోక్, ఉపాధ్యక్షుడు రామారావు, అంబాల రాంగోపాల్ గౌడ్, శ్రీరంగం సాగర్, న్యాయవాదులు వేణుగోపాల్ రెడ్డి, అంబాల సుధీర్ గౌడ్, జయప్రకాష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం





అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

రాజకీయ వివక్షకు తావులేదు

మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం: ఎమ్మెల్యే శంకర్

తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 18: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. కేశంపేట మండల కేంద్రంలోని నూర్ ఫంక్షన్ హాల్‌లో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో ఎక్లాస్ ఖాన్‌పేట్‌లో 30 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. కేశంపేట మండలం లోని ప్రతి గ్రామంలో అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.గత ప్రభుత్వం సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసిందని విమర్శించారు. గ్రామ పంచాయతీల్లో చేసిన పనులకు సర్పంచులకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని అన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు,ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మండలం దాటినా.. మానవత్వంతో అండగా నిలిచిన యాదవ రెడ్డి..

అనూషకు రూ.1,౧౯,500 సీఎం సహాయనిధి!

రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి సహకారంతో ఆర్థిక సాయం మంజూరు

ప్రాంతాలు, మండలాలు చూడకుండా ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే లక్ష్యం: యాదవ రెడ్డి





తొలి అక్షరం/నెల్లికుదురు: నవంబర్18: ప్రజాసేవకు ప్రాంతీయ హద్దులు ఉండవు.. ఆపదలో ఉన్నవారి కన్నీళ్లు తుడవడానికి మానవత్వంతో స్పందించే మనసుంటే చాలు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మండలమే కాకుండా ఇతర ప్రాంతాల ప్రజల కష్టాలకూ స్పందిస్తూ నెల్లికుదురు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎదళ్ల యాదవ రెడ్డి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు.నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామానికి చెందిన అనూష అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. వైద్య చికిత్స కోసం ఇప్పటికే పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు కావడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో పడింది. వైద్య ఖర్చుల బిల్లులు పట్టుకుని సహాయం కోసం ఎదురుచూస్తున్న ఆమె కుటుంబ పరిస్థితిని యాదవ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి ద్వారా అనూషకు రూ.1,99,500 ఆర్థిక సాయం మంజూరయ్యేలా కృషి చేశారు.**మండలం ఏదైతే ఏంటి.. కష్టంలో ఉన్నది మనిషే కదా!** ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడానికి మండలాల హద్దులు ఉండవని, కష్టాల్లో ఉన్నవారు ఏ ప్రాంతానికి చెందిన వారైనా వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ముందుకు వస్తానని తెలిపారు. “మన దగ్గరకు వచ్చి తమ బాధను చెప్పుకున్నప్పుడు వారు ఏ గ్రామానికి చెందినవారు, ఏ మండలానికి చెందినవారు అని చూడకూడదు. ఆపదలో ఉన్నది మనిషి అని ఆలోచించాలి. మనకు చేతనైనంత సహాయం చేయాలి. అనూష కుటుంబం వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసి నా వంతు ప్రయత్నం చేశాను. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి ద్వారా రూ.1,99,500 మంజూరు కావడం సంతోషంగా ఉంది. కష్టాల్లో ఉన్న కుటుంబానికి కొంతైనా ఊరట కలిగితే అంతకంటే సంతృప్తి మరొకటి ఉండదు“ అని పేర్కొన్నారు.**పదవుల కంటే ప్రజల కష్టాలకు స్పందించే గుణమే ముఖ్యం!** రాజకీయాలు, పార్టీలు, ప్రాంతాలు వేరైనా ప్రజల కష్టాలు ఒక్కటేనని ఈ ఘటన చాటిచెప్పింది. నెల్లికుదురు మండలానికి చెందిన నాయకుడిగా ఉంటూ, మరో మండలంలోని కుటుంబానికి సైతం అండగా నిలవడం యాదవ రెడ్డి మానవతా దృక్పథాన్ని తెలియజేస్తోంది. పదవులు, హోదాలు తాత్కాలికమైనా ఆపద సమయంలో అందించిన సహాయం, చూపిన మానవత్వం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయి. ప్రజల మధ్య ఉండటమే కాదు.. ప్రజల కష్టాల్లోనూ తోడుగా నిలిచే నాయకత్వమే నిజమైన ప్రజాసేవకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.**అండగా నిలిచిన యాదవ రెడ్డి..** అనూష మాట్లాడుతూ.. మా సమస్యను యాదవ రెడ్డికి చెప్పగానే.. “అదేం లేదు బిడ్డా.. నేనున్నాను, కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి నీకు అండదండలు ఉంటాయి.. నీకు సహాయం అందేలా నేను చూసుకుంటాను“ అంటూ ధైర్యం చెప్పారు. చెప్పిన మాట ప్రకారం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందేలా కృషి చేశారు. కష్టకాలంలో మాకు అండగా నిలిచిన యాదవ రెడ్డి కి జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తి మార్గంలో నడవాలి

- **ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ**
- **శివదీక్ష గురుస్వామి గోగులోతు శంకర్ నాయక్**



తొలి అక్షరం/చౌటుప్పల్. నవంబర్ 18: ప్రతి ఒక్కరూ జీవితంలో ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, ముఖ్యంగా నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ భక్తి మార్గంలో నడవాలని శివదీక్ష గురుస్వామి గోగులోతు శంకర్ నాయక్ అన్నారు.కార్తీక మాసంలో పరమశివునిపై అపారమైన భక్తితో శివదీక్ష స్వీకరించడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు. ఆధ్యాత్మికత మనిషిలో క్రమశిక్షణ, మానసిక ప్రశాంతతతో పాటు సేవాభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు.నేటి సమాజంలో యువత మంచి ఆలోచనలను అలవర్చుకుంటూ, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకుంటూ ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అలవర్చుకోవాలని గోగులోతు శంకర్ నాయక్ పిలుపునిచ్చారు.

కారోబార్ తీరుపై గ్రామస్తుడి ఫిర్యాదు

- **లంచాలు అడుగుతున్నారంటూ ఆరోపణలు...**

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతి



తొలిఅక్షరం/నర్సింహులపేట నవంబర్ 18: నర్సింహులపేట మండలంలో రూప్ల తండా గ్రామ పంచాయతీ కారోబార్ లకావత్ దేవేందర్‌పై లంచాల డిమాండ్ ఆరోపణలు వచ్చాయి. గ్రామ ప్రజలు వివిధ పనుల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి వెళ్లినప్పుడు లంచాలు అడుగుతున్నారని గ్రామానికి చెందిన గుగులోత్ లింగ్యా ఆరోపించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.కారోబార్ తీరుతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులు, సాక్షుల వాంగ్మూలాలు సేకరిం చాలని కోరారు. ఆరోపణలు రుజువైతే నిబంధనల ప్రకారం సస్పెన్షన్ తోపాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరారు.

రౌడీలతో మద్యం విక్రయాల దందా..?

- బెల్ట్‌షాపుల తనిఖీల పేరుతో బెదిరింపులు.. ఎక్సైజ్ అధికారుల మౌనంపై అనుమానాలు



తొలిఅక్షరం/నర్సింహులపేట నవంబర్ 18 : నర్సింహులపేట మండలంలో మద్యం విక్రయాల వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. ఎమ్మార్పీ ధరలకు మించి మద్యం విక్రయిస్తూ వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇతర ప్రాంతాల నుంచి మద్యం కొనుగోలు చేసి తెచ్చుకుంటున్న వారిని కొందరు వ్యక్తులు బెదిరిస్తూ, దాడులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి.**తనిఖీలు ఎవరు చేయాలి?** బెల్ట్‌షాపులపై తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులది. అయితే అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ప్రైవేట్ వ్యక్తులు రంగంలోకి దిగి తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలు వీరికి తనిఖీలు చేసే అధికారం ఎవరిచ్చారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బెల్ట్‌షాపుల నిర్వహణలో రౌడీ మూకల ప్రమేయం ఉందనే ప్రచారం కూడా స్థానికంగా కలకలం రేపుతోంది.**గ్రామాల్లోనూ యథేచ్ఛగా విక్రయాలు**మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లోనూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. దీంతో యువత మద్యానికి అలవాటుపడటమే కాకుండా కుటుంబాల్లో గొడవలు పెరుగుతున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు.**అధికారుల అండదండలు ఉన్నాయా?** బెల్ట్‌షాపుల వ్యవహారంపై గతంలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాల్సిన అధికారులు మౌనంగా ఉండటం, మరోవైపు ప్రైవేట్ వ్యక్తులు తనిఖీల పేరుతో బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. తనిఖీల పేరుతో దౌర్జన్యాలకు పాల్పడితే సామాన్యులు, చిన్న వ్యాపారులు భయాందోళనకు గురయ్యే పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**ఉన్నతాధికారులు స్పందించాలి** జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నర్సింహులపేట మండలంలోని మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ మద్యం వ్యాపారానికి అడ్డుకట్ట వేయడంతో పాటు తనిఖీల పేరుతో ప్రైవేట్ వ్యక్తులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులే కీలకం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి.. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోండి

డ్రగ్ ఫ్రీ తెలంగాణే లక్ష్యం.. లక్ష మంది విద్యార్థులకు అవగాహన: డాక్టర్ రవీందర్ రెడ్డి



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 18: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని అసిస్టెంట్ ప్రొఫెసర్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ‘డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. జీవితానికి దగ్గరగా ఉండండి’ అనే నినాదంతో 250 మంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యం, విద్యాభ్యాసం, కుటుంబ జీవితం, భవిష్యత్తు దెబ్బతింటాయని వివరించారు. మత్తు పదార్థాల అలవాట్లను గుర్తించి బాధిత విద్యార్థులకు సహకారం అందించాలని సూచించారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో లక్ష మంది విద్యార్థులకు అవగాహన కల్పించడమే తన లక్ష్యమన్నారు. తొలుత షాద్‌నగర్‌ను డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల మహా పాదయాత్రను విజయవంతం చెయ్యండి

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ జ్వాలను రగిలించిన ఉద్యమకారులకు స్వరాష్ట్రంలో దక్కని గౌరవం

పాదయాత్ర కరపత్రం ఆవిష్కరించిన వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్




తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: ఈ నేల 22న ప్రారంభమయ్యే పాదయాత్ర కరపత్రాన్ని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆవిష్కరించారు.ప్రత్యేక తెలంగాణ ఉద్యమ జ్వాల ఎలా రగిలిందో,ఆ ఉద్యమానికి ఊపిరి పోసింది ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని,సకల జనుల సమ్మెతో,విద్యార్థుల ఆత్మబలిదానాలతో ఉద్యోగుల పోరాటంతో,బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీల కదం తొక్కడంతో తెలంగాణ ఉద్యమ జ్వాల రగిలింది.నీళ్లు,నిధులు,నియామకాలు అనే నినాదంతో ఉద్యమకారులు నాడు వీధుల్లోకి వచ్చి కొట్లాడితేనే నేడు ప్రత్యేక తెలంగాణ వచ్చింది.కానీ ఆ ఉద్యమానికి ఊపిరి పోసిన ఉద్యమకారులకు ప్రత్యేక రాష్ట్రంలో దక్కాల్సిన గౌరవం దక్కలేదని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.హన్మకొండ నయీమ్ నగర్ లోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ తమ్మల శోభారాణి చేపట్టనున్న పాదయాత్ర కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ...నాడు తెలంగాణ ఉద్యమ జ్వాలను రగిలించింది ఉద్యమకారులే.నేడు ఆ ఉద్యమకారుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.వారికి అధికారంలో వాటా లేదు,నీళ్లు,నిధులు,నియామకాలలో వాటా లేదు.ఇది అమరవీరుల ఆశయానికి తూట్లు పొడిచినట్లేనన్నారు.తెలంగాణా ఉద్యమ నాయకురాలు తమ్మల శోభారాణి చేస్తున్న ఈ పోరాటం,ఈ పాదయాత్ర మరో ఉద్యమ జ్వాలను రగిలించే విధంగా ఉందని,నీళ్లు,నిధులు,నియామకాల కోసం నాడు పోరాటం–ఆత్మగౌరవం,అధికార పదవుల కోసం నేడు కదం తొక్కుదాం అనే ఆమె నినాదం ప్రతి ఉద్యమకారుడి గుండెల్లో మారుమోగాలని పిలుపునిచ్చారు.ఈ పాదయాత్రతోనైనా ప్రభుత్వం దిగివచ్చి, ఉద్యమకారులకు అధికారంలో వాటా,నీళ్లు,నిధులు,నియామకాలలో వాటా ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరుతున్నాం.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులంతా ఈ పాదయాత్రలో పాల్గొని ఈ పాదయాత్ర విజయవంతం చేయాలని వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు.వరంగల్ పోచమ్మ మైదాన్ రాణి రుద్రమదేవి విగ్రహం నుండి హైదరాబాద్ లోని అమరవీరుల స్మారక భవనం వరకు సాగే ఈ పాదయాత్రకు బీసీ సంక్షేమ సంఘం పూర్తి మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో తెలంగాణా ఉద్యమ కారులు నరెడ్ల విజయ,కొడపాక అన్నపూర్ణ,గిరిబోయిన రాధిక,ఇంజె బావన,జూపాక ఇందిర,ప్రమాదదేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కారుకు ప్రమాదం

- కోళ్ల వ్యాన్‌ను ఢీకొన్న కారు.. నలుగురికి స్వల్ప గాయాలు

- వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు.. అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు





తొలి అక్షరం/కొత్తూరు, నవంబర్ 18: తెలంగాణ ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం యాదృచ్ఛికంగా జరిగిందా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు.తిరుపతిలో శ్రీవారి దర్శనం అనంతరం హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా బుధవారం తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం నాట్కో జంక్షన్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మార్గమధ్యంలో కోళ్ల లోడుతో వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను బల్మూరి వెంకట్ ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాద ధాటికి కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది.ప్రమాద సమయంలో కారులో బల్మూరి వెంకట్‌తో పాటు ఆయన భార్య, సోదరుడు చాణక్య, డ్రైవర్ శ్రీకాంత్ ఉన్నారు. ఈ ఘటనలో వెంకట్ దంపతులతో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.ఈ ఘటనపై బల్మూరి వెంకట్ సోదరుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోళ్ల వ్యాన్ డ్రైవర్ నాగేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల కారణాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నట్లు ఏసీపీ లక్ష్మీనారాయణ వెల్లడించారు. ప్రమాదం జరిగిన తీరుతో పాటు ఇతర వివరాలను సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక కార్యాచరణ

98 శాతం పింఛన్ల దరఖాస్తులకు ఆమోదం.

రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా..


మహిళలకు 50 వేల చీరలు

లాల్‌పహాడ్‌లో 570 మందికి పింఛన్ల పంపిణీ..

కొందుర్గులో 497 మందికి ప్రొసీడింగ్ పత్రాలు..

చౌదరిగూడెంలో డబుల్ రోడ్డుకు శంకుస్థాపన, కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం





తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 18: అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన చేయూత పింఛన్లతో పాటు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, మహిళలకు చీరల పంపిణీ, రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. జిల్లేడు చౌదరిగూడెం మండలం లాల్‌పహాడ్‌లో 570 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ...పింఛన్లు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక అండగా నిలుస్తున్నాయని, ఆత్మగౌరవంతో జీవించేందుకు భరోసా ఇస్తున్నాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల్లో దాదాపు 98 శాతం మందికి మంజూరు లభించిందని ఎమ్మెల్యే వెల్లడించారు. మండలాల వారీగా ఫరూఖ్‌నగర్‌లో 970, షాద్‌నగర్ పట్టణంలో 760, కేశంపేటలో 716, నందిగామలో 545, చౌదరిగూడెంలో 540, కొందుర్గులో 497, కొత్తూరు మండలంలో 368, కొత్తూరు మున్సిపాలిటీలో 119 పింఛన్లు మంజూరయ్యాయని వివరించారు. కొందుర్గు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో 497 మంది కొత్త పింఛన్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, జిల్లేడు చౌదరిగూడెం మండలం లాల్‌పహాడ్ నుంచి మండల కేంద్రం వరకు రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న డబుల్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మండల కేంద్రానికి నిత్యం రాకపోకలు సాగించే వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు మంజూరుకు కృషి చేసినట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ కార్యాలయం కార్యకర్తలకు అందుబాటులో ఉండటంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని సూచించారు. కార్యకర్తలే పార్టీకి బలమని, ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రహదారులు, విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మహమ్మద్ అలీఖాన్ బాబర్, ఎంపీడీవో శ్రీరామ్, తహసీల్దార్ అజం అలీ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్. చంద్రశేఖర్, కోగురి పురుషోత్తం రెడ్డి, కేకే కృష్ణ, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నవంబర్ 19న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ప్రారంభించనుందని వీర్లపల్లి శంకర్ తెలిపారు. కుటుంబ పెద్ద అకాల మరణం చెందితే ఆ కుటుంబానికి రూ. 5 లక్షల బీమా అందుతుందని, 18 నుంచి 59 ఏళ్ల వయస్సున్న కుటుంబ యజమానులకు ఈ సదుపాయం వర్తిస్తుందని చెప్పారు. బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని, లబ్ధిదారులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని 153 గ్రామ పంచాయతీలు, షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రేషన్‌కార్డు, ఆధార్, కుటుంబ యజమాని, నామినీ వివరాలతో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలోని పేద కుటుంబాలకు చెందిన మహిళలకు 45 వేల నుంచి 50 వేల వరకు

భాజపా ధార్మిక సెల్ జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలి

● నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలి: రాష్ట్ర కన్వీనర్ సూర్యప్రకాష్



తొలిఅక్షరం/నర్సింహులపేట, నవంబర్ 18: నర్సింహులపేట మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నేడు నిర్వహించనున్న భాజపా ఎండోమెంట్స్ ధార్మిక సెల్ మహబూబాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని భాజపా ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. జిల్లా స్థాయి సమావేశానికి భాజపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ధార్మిక అంశాలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

షాద్‌నగర్‌లో రేపు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా బంద్

మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ కోత

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ బంద్



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 18: 220/132 కేవీ షాద్‌నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నవంబర్ 19న (బుధవారం) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు TGSPDCL అధికారులు తెలిపారు. షాద్‌నగర్‌లోని అన్ని కాలనీలతో పాటు ఫరూఖ్‌నగర్, నాగులపల్లి, రాసమల్లగూడెం, సోలిపూర్, సాయిబాలాజీ టౌన్‌షిప్, చటాన్‌పల్లి, చించోడ్, కిషన్‌నగర్, హాజిపల్లి, దేవునిపల్లి, అయ్యవారిపల్లి, భీమారం, విట్యాల గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని షాద్‌నగర్ టౌన్, రూరల్ ఏఈలు కోరారు.

కమ్మదనం గ్రామ అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు

- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ లతశ్రీ కిరణ్ గౌడ్



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 18: ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని గ్రామ సర్పంచ్ లతశ్రీ కిరణ్ గౌడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చల్ల శ్రీకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కమ్మదనంలో తొలి విడతలో 22 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించామని తెలిపారు. గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్దింటి జగన్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల హక్కులపై తల్లిదండ్రులకు అవగాహన

- నందిగామ మొబైల్ క్రెచ్ కేంద్రంలో సమావేశం



తొలి అక్షరం/నందిగామ, నవంబర్ 18: చిన్నారుల హక్కులు, సంరక్షణ, ప్రాథమిక బాల్య అభివృద్ధిపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంపొందించేందుకు నందిగామ మొబైల్ క్రెచ్ కేంద్రంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో మొబైల్ క్రెచెస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా క్రెచ్ సూపర్‌వైజర్ పవిత్ర పాల్గొని అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారికి విద్య, ఆట, పోషణ, ఆరోగ్యం, రక్షణ, సమానత్వం హక్కులని వివరించారు. పిల్లల జీవితంలోని తొలి వెయ్యి రోజులు మెదడు అభివృద్ధి, శారీరక ఎదుగుదలకు ఎంతో కీలకమన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. చిన్నారులతో సమయం గడుపుతూ ప్రేమగా సంరక్షించాలని తెలిపారు. PALNA పథకం కింద అమలవుతున్న ఎస్‌బీఐఎఫ్ ముస్కాన్ ప్రాజెక్టులో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు.

హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి వాకర్స్ ఇంటర్నేషనల్ 40 ఏళ్ల వేడుకల ఆహ్వానం




తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 303 (వరంగల్,ఏరియా3, రీజియన్ 12) ఆధ్వర్యంలో 6 డిసెంబర్2026న హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్‌లోని పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో ఉదయం 5:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిర్వహించనున్న 'వాకర్స్ ఇంటర్నేషనల్ 40 ఏళ్ల వేడుకలు - 2026' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరుతూ,హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.నడక ప్రాముఖ్యత,శారీరక దృఢత్వం, ఆరోగ్య అవగాహన కల్పిస్తూ వాకర్స్ ఉద్యమం 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పరిశీలకులు ఎస్.మురళీ కృష్ణ (ఎవిపి), చైర్మన్ జంగా గోపాల్ రెడ్డి (పిఎవిపి), కో- చైర్మన్ తడక కుమారస్వామి గౌడ్ (పిఎవిపి), కో-కన్వీనర్ పచ్చిమట్ల ఎల్ల గౌడ్ (ఆర్ సి),సభ్యులు కస్తూరి రాజు (డి జి ఎలెక్ట్),చాడ దశరథ రామిరెడ్డి (చీఫ్ అడ్వైజర్)అన్ని క్లబ్‌ల అధ్యక్షులు పాల్గొననున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నాలుగు లక్షలకు పైగా కొత్త చేయూత పింఛన్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 13 డివిజన్ల లబ్ధిదారులకు మంజూరైన పింఛన్ల ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం హన్మకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ గుండు సుధారాణి, హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న పాల్గొని లబ్ధిదారులకు ఉత్తర్వులు అందజేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రజాపాలన పేదల సంక్షేమమే మా ప్రథమ ప్రాధాన్యత

- తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది అని తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2,698 మందికి చేయూత ఆసరా పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ చేసారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,ఎంపీ కడియం కావ్య చేతుల మీదుగా పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజుమాట్లాడుతూ.. 31వ డివిజన్‌లో వందలాది పేద,అర్హులైన కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తూ,పెన్షన్లతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలనలో అర్హతే ప్రామాణికంగా,ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం,నాయిని రాజేందర్ రెడ్డి నాయకత్వంలో 31వ డివిజన్‌లో సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువవుతున్నాయి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు,డివిజన్ ఇన్‌చార్జి మార్క విజయ్ కుమార్,డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్,ముప్ప వేణు,గుండు సత్యం,నాగనబోయిన బాబురావు,శీలం శ్రీనివాస్,డిసిసి కార్యవర్గ సభ్యులు మామిండ్ల సురేష్,మంద సునీల్,కనుకుంట్ల కృష్ణ,గోపు సుధాకర్,మామిండ్ల రమేష్,కనుకుంట్ల శివ,బక్కదట్ల కార్తీక్ మరియు డివిజన్ నాయకులు,యువజన నాయకులు పాల్గొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజాపాలన పేదల సంక్షేమం,ప్రజల అభ్యున్నతే మా లక్ష్యం అని మామిండ్ల సురేష్ ఈ సందర్భంగా తెలిపారు.

8లిని మందికి కొత్త చేయూత పింఛన్లు

- అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తాం: ఎమ్మెల్యే మురళి నాయక్



తొలి అక్షరం, మహబూబాబాద్ బ్యూరో (నవంబర్ 18):అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పింఛన్లు అందజేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ తెలిపారు. బుధవారం కేసముద్రం పురపాలక సంఘంలోని హరిహర గార్డెన్స్‌లో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వరరావుతో కలిసి 899 మంది లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదలు, మహిళలు, చేనేత, గీత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పింఛన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసిన వారికి కొత్త పింఛన్లతో ఊరట కలిగిందని తెలిపారు. నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పింఛన్ నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని వెల్లడించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఫార్మసీ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో మెగా జాబ్ మేళా





ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ మొంతు కుమార్ ఎం పటేల్

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హనుమకొండ లోని కాళోజి కళాక్షేత్రంలో నిర్వహించిన వరల్డ్ ఫార్మసిస్ట్ డే&నేషనల్ ఫార్మసీ వీక్ 2026 కార్యక్రమంలో పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్ పర్సన్,మాజీ రాజ్యసభ సభ్యురాలు,జి డబ్ల్యూ ఎం సి మాజీ మేయర్ గుండు సుధారాణి పాల్గొని ప్రసంగించారు.యాంటి బయాటిక్స్ ఎక్కువ వాడకం వల్ల ఆరోగ్య సమస్యలు పెరిగి ఇబ్బంది తప్పదని,ఫార్మసీ డిగ్రీ లేని వారు వీటి వాడకాన్ని పెంచారని వక్తలు అభిప్రాయ పడ్డారు.ప్రపంచ ఫార్మసిస్ట్ డే- నేషనల్ ఫార్మసీ వీక్ 2026 ను పురస్కరించుకొని వరంగల్ లో సదస్సు జరిగింది.తెలంగాణ హైదరాబాదులో త్వరలో ఫార్మసీ మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ మొంతు కుమార్ ఎం పటేల్ ప్రకటించారు.ఇప్పటికే గుజరాత్ లో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా వేలాదిమంది ఉపాధి అవకాశాలు పొందారని వెల్లడించారు. భవిష్యత్తులో ఫార్మారంగానికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు.ప్రపంచ ఫార్మసిస్ట్ డే- నేషనల్ ఫార్మసీ వీక్ 2026 ను పురస్కరించుకొని వరంగల్లో గల కాళోజి కళాక్షేత్రంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.వివిధ ప్రాంతాల నుంచి 40 ఫార్మసీ కళాశాల ద్వారా 4000 మందికి పైగా విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని ఫార్మసి ఉన్నతికి కృషి చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పట్టణం లో భారీ ర్యాలీ నిర్వహించారు.విశ్వంభరా ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో నిర్వహించిన ఈ ర్యాలీ వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు సుమారు రెండున్నర కిలోమీటర్లు సాగింది.కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫార్మసీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఫార్మాసిటీని నెలకొల్పారని చెప్పారు.రాబోయే రోజుల్లో అనేక నూతన సంస్థలు ఈ రంగంలో ప్రవేశించి ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని,రీసెర్చ్ డెవలప్మెంట్ బాగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన మాజీ ఎంపీ, కూడా చైర్మన్ గుండు సుధారాణి మాట్లాడుతూ వైద్యరంగంతో దీటుగా ఫార్మసీరంగం అభివృద్ధి చెందడం ద్వారా అనేక నూతన ఔషధాలు తయారీకి అవకాశం కలుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మొంత్ కుమార్ ఎం పటేల్,కేయూ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ కె ప్రతాప్ రెడ్డి,విశ్వంభర ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ సిహెచ్ దేవేందర్ రెడ్డి,సీఈవో సిహెచ్ విశ్వంభర్ రెడ్డి,ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్టేట్ కన్వీనర్ డాక్టర్ ఎం వెంకటరమణ,కో కన్వీనర్ డాక్టర్ వి ప్రభాకర్ రెడ్డి,ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ డాక్టర్ సలీముల్లాఖాన్,తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఏ శ్రీధర్,కోఆర్డినేటర్లు డాక్టర్ జె వెంకటేశ్వర్ రావు,ప్రొఫెసర్ వై నరసింహారెడ్డి,డాక్టర్ జి అనిల్ కుమార్,డాక్టర్ కే శ్రీనివాస్ రెడ్డి లతోపాటు ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు,ప్రొఫెసర్లు,అసోసియేట్ ప్రొఫెసర్లు,ఫార్మసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

డాక్టర్ జితేందర్ రావుకు మహాత్మా జ్యోతిరావు ఫూలే పురస్కారం



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్18:
జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకు చేస్తున్న విశేష సేవలకు గాను సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీవైజేఎఫ్) అధ్యక్షుడు డాక్టర్ జితేందర్ రావు తనుగులకు మహాత్మా జ్యోతిరావు ఫూలే ఆత్మీయ సేవా పురస్కారం–2026 ప్రదానం చేశారు.ఆమని శ్రుతి లయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ముఖ్య అతిథిగా సిరికొండ మధుసూదనాచారి హాజరయ్యారు.కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్, ఆర్టీఐ మాజీ కమిషనర్ కె.విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.ది సౌత్ ఇండియా టైమ్స్ బ్యూరో చీఫ్‌గానూ పనిచేస్తున్న జితేందర్ రావు.. యువ జర్నలిస్టుల ప్రోత్సాహం, అక్రిడిటేషన్లు, ఆరోగ్య భద్రత తదితర అంశాలపై నిరంతరం కృషి చేస్తున్నారని వారు అభినందించారు.

డిసెంబర్ 19న 'హైదరాబాద్ గ్లోబల్ ఐకాన్స్ అవార్డ్ 2026'

తొలి అక్షరం,హైదరాబాద్, నవంబర్ 18:

వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి, సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రముఖులను సత్కరించేందుకు 'ఎలైట్ లీడర్‌షిప్ కౌన్సిల్' ఆధ్వర్యంలో 'హైదరాబాద్ గ్లోబల్ ఐకాన్స్ అవార్డ్స్ 2026' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. డిసెంబర్ 19వ తేదీన బేగంపేటలోని కంట్రీ క్లబ్‌లో ఈ వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు కౌన్సిల్ అధ్యక్షుడు చైతన్య జంగా, ఉపాధ్యక్షుడు పాకలపాటి విజయ వర్మ బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.కళలు, సినిమా, వ్యాపారం, విద్య, వైద్యం, సాంకేతికత, మీడియా, సామాజిక సేవ, మహిళా సాధికారత తదితర రంగాల్లో ప్రతిభావంతుల విజయగాథలను ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని వారు పేర్కొన్నారు.

ఈ వేడుకకు పలువురు రాష్ట్ర మంత్రులతో పాటు సినీ నటి లయ ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. మరిన్ని వివరాలకు 98663 33787, 98486 69996 నంబర్లలో సంప్రదించాలని కోరారు.ఈ సందర్భంగా కార్యక్రమ ఫ్లయర్‌ను కంట్రీ క్లబ్ చైర్మన్ రాజీవ్ రెడ్డి ఆవిష్కరించి, నిర్వాహకులను అభినందించారు. ఈ సమావేశంలో సినీ నటీమణులు, మోడల్స్ మేఘ బెనర్జీ, ప్రతిమ మౌర్య, భావన శర్మ, ఫిట్‌నెస్ గురు అను ప్రసాద్, వ్యాపారవేత్త మహేష్ కుమార్, మిథాని ఈశ్వర్, కోడె చైతన్య, రామిశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం

- రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల కొత్త పెన్షన్లకు ఆమోదం.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి









తొలి అక్షరం/కల్లూరు, నవంబర్ 18:అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు పట్టణంలోని వికేఆర్ ఫంక్షన్ హాల్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పాలకులు రాష్ట్రంపై రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం మోపినప్పటికీ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి కోతలు విధించడం లేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 72 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు అందించడంతో పాటు మరో 14 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేశామని పేర్కొన్నారు.**మహిళా సంఘాలకు రూ.73 వేల కోట్ల రుణాలు** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో గత 33 నెలల్లో మహిళా సంఘాలకు రూ.73 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించినట్లు మంత్రి తెలిపారు. మహిళలకు బస్సులు, క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ వంటి రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు.**అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాద్ ప్రాంతంలో మరో లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం సుమారు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోందని, లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2.21 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. **4.5 లక్షల కొత్త పెన్షన్ల మంజూరు** రాష్ట్రవ్యాప్తంగా వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హుల కోసం 4.5 లక్షల నూతన పెన్షన్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. కల్లూరు మండలం, మున్సిపాలిటీ పరిధిలో పాత, కొత్త పెన్షన్లు కలిపి 1,249 మందికి ప్రతినెలా సుమారు రూ.2.18 కోట్ల పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పెన్షన్ మంజూరు కాని అర్హులు నిరుత్సాహపడవద్దని, దశలవారీగా అందరికీ పెన్షన్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ.. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. కల్లూరు మండలంలో రెండు విడతల్లో 1,040 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో రూ.5 లక్షల ఆర్థిక సాయం జమ చేస్తున్నామని తెలిపారు. కల్లూరు పట్టణ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ చైర్మన్, ఎంపీడీవో డి. చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మా అమ్మ నా సినిమానే ముందు చూస్తుంది: దుల్కర్



మలయాళ స్టార్ నటుడు దుల్కర్ సల్మాన్ నటించిన తాజా తెలుగు చిత్రం 'ఆకాశంలో ఒక తార'. ఈ సినిమా నవంబర్ 20న బాక్సాఫీస్ ముందుకు రాబోతోంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, సరిగ్గా అదే రోజు ఆయన తండ్రి, దిగ్గజ నటుడు మమ్ముట్టి నటించిన తమిళ చిత్రం 'ఓం' కూడా థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో బాక్సాఫీస్ వద్ద తండ్రీకొడుకుల సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది. ఈ పోటీపై దుల్కర్ సల్మాన్ సరదాగా స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

దర్శకుడు పవన్ సాధినేని రూపొందించిన 'ఆకాశంలో ఒక తార' చిత్రానికి సంబంధించి చెన్నైలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో దుల్కర్ సల్మాన్ పాల్గొన్నారు. ఒకే రోజున తండ్రీకొడుకుల చిత్రాలు విడుదల కానుండటంతో పోటీ తీవ్రంగా ఉంటుందా? అలాగే ఇంట్లో అమ్మ ఎవరి సినిమాను ముందుగా చూస్తారు? అని విలేకరులు దుల్కర్‌ను ప్రశ్నించారు.

ఈ ప్రశ్నకు దుల్కర్ చిరునవ్వుతో బదులిస్తూ.. తన తల్లి ఎల్లప్పుడూ తన వైపే ఉంటుందని, తన సినిమానే ముందుగా చూస్తుందని చమత్కరించారు. "నేను ఇన్ని సంవత్సరాలుగా నటిస్తున్నాను.. మీ అమ్మ నా సినిమాల గురించి ఎప్పుడూ ఇలా అడగలేదు, అలాగే నా చిత్రాలను ఇంత శ్రద్ధగా ఎప్పుడూ చూడలేదు. నువ్వు ఇండస్ట్రీకి వచ్చాకే నీ సినిమాలన్నింటినీ ఆమె ఎంతో ఆసక్తిగా చూస్తోంది అని మా నాన్న ఎప్పుడూ నాతో అంటుంటారు" అని దుల్కర్ సరదాగా పేర్కొన్నారు.అనంతరం ఈ పరిణామంపై ఆయన వివరిస్తూ.. ఇది తమకు ఒక గొప్ప ఆశీర్వాదం వంటిదని అన్నారు. "మేమిద్దరం మలయాళ నటులం. అయినప్పటికీ నా చిత్రం నేరుగా తెలుగులో వస్తుండగా, మా నాన్న చిత్రం 'ఓం' నేరుగా తమిళంలో విడుదలవుతోంది. ఇద్దరి చిత్రాలు ఒకేసారి రావడం మా ఇద్దరికీ ఎంతో సంతోషకరమైన, గర్వించదగ్గ సందర్భం" అని ఆయన తెలిపారు.

ఇక 'ఆకాశంలో ఒక తార' విషయానికి వస్తే, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ఇప్పటికే 'యూ/ఏ') సర్టిఫికెట్ జారీ చేసింది. ఇటీవల విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది.

చెక్ బౌన్స్ కేసులో నిర్మాత బండ్ల గణేశ్‌కు ఏడాది జైలు శిక్ష



టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్‌కు న్యాయస్థానంలో ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. చెక్ బౌన్స్ కేసులో ఆయనకు ఒంగోలు కోర్టు ఏడాది సాధారణ జైలు శిక్ష విధించింది. శిక్షతో పాటు రూ. 95 లక్షల భారీ జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కీలక తీర్పు వెలువరించారు.

పూర్తి వివరాల్లోకి వెళితే... ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జెట్టి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి బండ్ల గణేశ్ తన నిర్మాణ సంస్థ 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్' పేరిట రూ. 95 లక్షల విలువైన చెక్ ఇచ్చారు. అయితే, బ్యాంక్ ఖాతాలో సరిపడా నిధులు లేకపోవడంతో ఆ చెక్ బౌన్స్ అయింది. నగదు చెల్లింపు విషయంలో న్యాయం జరగకపోవడంతో బాధితుడు ఒంగోలు కోర్టును ఆశ్రయించారు.

ఈ కేసుపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం, నేరం రుజువు కావడంతో కోర్టు బండ్ల గణేశ్‌ను దోషిగా తేల్చింది. ఆయనకు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 95 లక్షల జరిమానా విధించింది. జరిమానా మొత్తంతో పాటు, ఈ కేసు విచారణ నిమిత్తం బాధితుడికి అయిన కోర్టు ఖర్చులను కూడా బండ్ల గణేశే పూర్తిగా భరించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు.గతంలోనూ పలు చెక్ బౌన్స్ కేసుల్లో బండ్ల గణేశ్‌కు న్యాయస్థానాలు జైలు శిక్షలు విధించగా, ఆయన పైకోర్టుల్లో అప్పీల్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే.

తమిళంలోకి ఆనంద్ దేవరకొండ సినిమా



టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తమ్ముడు, యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన తెలుగులో నటించిన క్రైమ్ కామెడీ చిత్రం 'గం గం గణేశా' ఇప్పుడు తమిళ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాను తమిళంలో 'జై జై గణేశా' పేరుతో అనువదించి విడుదల చేస్తున్నారు. జేజే మూవీస్ పతాకంపై నిర్మాత విజయ్ మాధవన్ ఈ చిత్రాన్ని తమిళంలో రిలీజ్ చేస్తున్నారు. పూర్తిస్థాయి యాక్షన్, థ్రిల్లర్, కామెడీ అంశాలతో వినోదాత్మక చిత్రంగా దీనిని రూపొందించారు. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ సరసన నయన్ సారిక, ప్రగతి శ్రీవాస్తవ హీరోయిన్లుగా నటించారు. ప్రతినాయకుడి పాత్రలో రాజ్ అరుణ్ నటించగా, దర్శకుడు ఉదయ్ బొమ్మిశెట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. వెన్నెల కిశోర్, సత్యం రాజేష్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

తెలుగులో ఒక చిన్నపాటి దొంగ పాత్రలో ఆనంద్ దేవరకొండ నటన, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విభిన్న కథలతో తెలుగులో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ఆనంద్ దేవరకొండ, ఇప్పుడు 'జై జై గణేశా' ద్వారా కోలీవుడ్ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమయ్యారు.

గోదారి గట్టు, మీసాల పిల్లను మించి మరోటి..!



2027 సంక్రాంతి పండుగ కొన్ని నెలలు ఉండగానే తెలుగు సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా సంక్రాంతికి విడుదల కాబోతున్న సినిమాల కోసం ఎదురు చూస్తున్నారు. సంక్రాంతి అనగానే తెలుగు సినిమా ఇండస్ట్రీలో అనిల్ రావిపూడి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన బ్యాక్ టు బ్యాక్ సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు సినిమాలతో వచ్చాడు. ఆ రెండు సినిమాలు ఏ రేంజ్ విజయాన్ని సొంతం చేసుకున్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కాకుండానే కేవలం తెలుగు వర్షన్‌తో ఏకంగా రూ.300 కోట్లు అంతకు మించి వసూళ్లు చేసిన సినిమాలుగా రికార్డ్ సృష్టించాయి. రాజమౌళి సినిమాలకు సైతం సాధ్యం కాని రికార్డ్‌లను అనిల్ రావిపూడి తన సంక్రాంతి సినిమాలతో సొంతం చేసుకున్నాడు. అందుకే ఆయన నుంచి 2027 సంక్రాంతికి రాబోతున్న 'జనవరి 12 విడుదల' సినిమా పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. సంక్రాంతికి జనవరి 12 విడుదల సినిమా... వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లు హీరోలుగా నటిస్తూ ఉండగా కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్స్‌గా కనిపించబోతున్నారు. వెంకటేష్‌కి జోడీగా కీర్తి సురేష్ నటిస్తూ ఉండగా, కళ్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టి కనిపించబోతుంది. వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లు బావ బామ్మర్ది కావడంతో వినోదం పీక్స్‌లో ఉంటుందని తెలుస్తోంది. కళ్యాణ్ రామ్‌కి అక్కగా లేదా చెల్లిగా కీర్తి సురేష్ కనిపించబోతుంది. వీరిద్దరి కాంబో సీన్స్ ఫుల్ టు కామెడీ అన్నట్లుగా ఉండబోతున్నట్లు యూనిట్ సభ్యులు చెబుతున్నారు. అంతే కాకుండా వెంకటేష్, కీర్తి సురేష్ కాంబోలో వచ్చే సీన్స్ సైతం గతంలో వచ్చిన ఎఫ్ 2 సినిమాను గుర్తు చేస్తాయని అంటున్నారు. మొత్తానికి సినిమాపై అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. దాంతో సినిమా నుంచి ఎప్పుడు ప్రమోషనల్ స్టఫ్ విడుదల అవుతుందా, పాటలు ఎప్పుడు వస్తాయా అని అభిమానులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్, కళ్యాణ్ రామ్... అనిల్ రావిపూడి గత సంక్రాంతి సినిమాలు అయిన సంక్రాంతికి వస్తున్నాం నుంచి మొదటి పాటను డిసెంబర్ నెలలో విడుదల చేయగా, మన శంకరవర ప్రసాద్ గారు సినిమా మొదటి పాటను మూడు నెలల ముందుగానే అంటే అక్టోబర్‌లోనే విడుదల చేయడం జరిగింది. ఆ రెండు పాటల వల్ల సినిమాల యొక్క మార్కెట్ డబుల్ అయింది, ప్రేక్షకుల్లో అంచనాలు రెండు మూడు రెట్లు పెరిగాయి అనడంలో సందేహం లేదు. అందుకే అనిల్ రావిపూడి 'జనవరి 12 విడుదల' సినిమా మొదటి పాట విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ మొదటి వారంలో జనవరి 12 విడుదల సినిమా నుంచి మొదటి పాట విడుదలకు రెడీ అవుతోంది. ఇప్పటికే సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ రెడీ చేసినట్లు తెలుస్తోంది. ఆ పాటకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియోను చిన్న కామెడీ స్కిట్‌గా రెడీ చేశారని కూడా యూనిట్ సభ్యుల నుంచి సమాచారం అందుతోంది.

ఆ మూవీ సెట్లో టార్చర్ చూపించారు.. - పూజిత పొన్నాడ!



ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నంకు చెందిన పూజిత పొన్నాడ ఇంజనీరింగ్ పూర్తి చేసి టాటా కన్సల్టెన్సీ లో ఉద్యోగం చేస్తున్న సమయంలోనే.. తనకంటూ ఒక ఐడెంటిటీ క్రియేట్ చేసుకోవడానికి సినిమా రంగంలోకి అడుగు పెట్టింది. అలా తొలిసారి 2015లో 'ఉప్మా తినేసింది' అనే షార్ట్ ఫిల్మ్ తో కెరియర్ మొదలుపెట్టిన ఈమె.. 2016లో ఊపిరి చిత్రంలో గ్యాలరీ మేనేజర్ గా నటించి.. ఆ తర్వాత రంగస్థలం సినిమాలో ఆది పినిశెట్టి ప్రియురాలిగా పద్మ క్యారెక్టర్ తో ప్రేక్షకులను అలరించింది పూజిత. తర్వాత రాజుగాడు, బ్రాండ్ బాబు, హ్యాపీ వెడ్డింగ్, 7 , కల్కి వంటి చిత్రాలలో కీలక పాత్రలు పోషించిన పూజిత.. తొలిసారి హీరోయిన్ గా నటించిన చిత్రం వేర్ ఈజ్ ది వెంకటలక్ష్మి.. అదే నేను చేసిన తప్పు కూడా.అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో తనకు టార్చర్ అంటే ఏంటో చూపించారు అంటూ దాదాపు ఏడేళ్ల తర్వాత తాను అనుభవించిన ఇబ్బందులను బయటపెట్టి అందరిని ఆశ్చర్యపరిచింది పూజిత పొన్నాడ. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమా హారర్ డ్రామాగా రూపొందుతోంది. ఇందులో సస్పెన్స్, ఎమోషన్స్ కీలకంగా ఉండనున్నాయి. పైగా కమిటీ కుర్రోళ్ళు సేమ్ ఈశ్వర్ రాచిరాజు ఇందులో హీరోగా నటిస్తున్నారు. నందు, లిఖిత తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి మంచి ప్లాట్ఫారం దొరికింది అనుకున్నాను. కానీ ఆ సినిమా షూటింగ్ సెట్లోకి అడుగుపెట్టాక తొలిసారి నా జీవితంలో వరస్ట్ సిచువేషన్ ని ఫేస్ చేశాను. ముఖ్యంగా ఈ విషయాన్ని నేను ఎప్పుడూ ఎక్కడ ఎవరితోనో చెప్పుకోలేదు. ఈ సినిమా షూటింగ్ సమయంలో నన్ను టార్చర్ చేశారు. బలవంతంగా నటించమని ఇబ్బంది పెట్టారు. నిజానికి నేను చాలా స్ట్రైట్ ఫార్వర్డ్ గా ఉంటాను. కానీ ఈ సినిమా సమయంలో నేను చాలా ఇబ్బంది పడ్డానముఖ్యంగా నేను ఇండస్ట్రీలోకి అప్పుడే కొత్తగా వచ్చాను. ఇండస్ట్రీ గురించి ఏమీ తెలియదు. పైగా ఎవరు తెలియదు. నిజానికి నేను రంగస్థలం, మైత్రి మేకర్స్ వంటి మంచి టీమ్లతో పనిచేశాను. అందులో సుకుమార్ , రామ్ చరణ్ లతో పని చేయడం చాలా అద్భుతంగా అనిపించింది. నేను రంగస్థలం సినిమా కోసం ఏడు రోజులు మాత్రమే పని చేశాను. ఆ సినిమా షూటింగ్ కూడా రాత్రివేళలో జరిగింది. ముఖ్యంగా రామ్ చరణ్ కష్టం అప్పుడే నాకు అర్థమైంది. సాధారణంగా ఒక ఆర్టిస్ట్ అంటే నటిస్తారు.. డబ్బులు తీసుకొని వెళ్ళిపోతారు అనుకుంటారు.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.